# కొత్త రచయితలు

## లవ్ స్టోరీ

## 'తెలవారదేమొ స్వామి'

ప్రేమ అవునో కాదో తెలియదు కాని "మను" అంటే నాకు చాలా ఇష్టం. మను తెల్లగా, పొడవుగా, అందంగా వుంటాడు. పెద్దమనిషిలా ఎవ్వరితో ఎక్కువగా మాట్లాడడు. ఆఖరికి నాతో కూడా. పెద్ద మనిషంటే పెద్ద మనిషేం కాదు. ఈ మధ్యే నా వైపు దొంగ చూపులు చూస్తున్నాడు. నాకు తెలియదనుకుంటాడు. కాని నేను పట్టేశాను. ఎలా అంటే నేనెపుడూ అతన్నే చూస్తుంటాగా మరి. మను వాళ్ళ ఇల్లు మా ఇంటి దగ్గరే. ఆంటీకి అంటే మను వాళ్ళ అమ్మకి నేనంటే ఇష్టం. ఆంటీ దగ్గర నేను వీణ నేర్చుకుంటున్నాను. ఉదయం చూశాను- మను పెంచే గులాబి మొక్కకి పువ్వు పూసింది. ఎర్ర గులాబి ఎంత ముద్దొస్తుందనీ! మను వాళ్ళ చెల్లెలు గులాబి కోసం ఎంత గొడవ చేసినా ససేమిరా ఇవ్వనన్నాడు మను. ఆ రోజు కూడా వీణ నేర్చుకోవటానికి మను వాళ్ళ ఇంటికి వెళ్ళాను. వీణ తీసి శ్రుతి చేసి ఆంటీ కోసం లోపలికి వెళ్ళాను. తిరిగి వచ్చేసరికి వీణ మీద ఎర్ర గులాబి నా కోసమే అన్నట్లుగా వుంది. గబుక్కున గులాబి అందుకుని ముద్దులతో ముంచెత్తాను. అది మను ప్రేమ పొందిన గులాబి. నాకు చాలా సంతోషమేసింది. ఎవరో నన్ను చూస్తున్నట్లు అనిపించి తలెత్తి చూశాను. కొద్ది దూరంలో నన్నే చూస్తున్న మను. నాకు సిగ్గేసింది. మను వైపు చూళ్ళేకపోయాను.

గులాబి వీణ మీద పెట్టి తలవంచుకున్నాను. మను వచ్చి గులాబి తీసుకుని తన గదికి వెళ్ళిపోయాడు. సంగీత సాధన అయిపోయిన తరువాత వెళ్ళిపోతూ కిటికీలో నుండి మను గదిలోకి చూశాను. పడుకుని ఏదో చదువుకుంటున్నాడు. మను గుండెలపై వుంది ఎర్ర గులాబి. "ఆంటీ! సాయంత్రం గుళ్ళో హరికథ వుందిట. అమ్మ మిమ్మల్ని రమ్మని చెప్పింది. నేను కూడా వస్తున్నాను" అని మనూకి వినిపించేలా చెప్పి వచ్చేశాను. గుడికి వెళ్ళాము. నాకు మను ఎక్కడా కన్పించ లేదు. అమ్మ వాళ్ళంతా మండపం దగ్గర కూర్చున్నారు. నేను ధ్వజ స్తంభం దగ్గర నుంచుని చూస్తున్నాను. అంతలో మా తమ్ముడు హరి వచ్చి "అక్కా అమ్మ పిలుస్తూంది, నువు పాట పాడాలిట" చెప్పాడు.

'పాటా! ఏ పాట పాడను? నువ్వు చెప్పు" హరి గాడ్ని అడిగాను. "తెలవారదేమొ స్వామి, నీ తలపుల మునకలో..." దాదాపుగా నా చెవిలో చెప్పినట్టుగా పాడుతూ వెళ్ళారెవరో. తల త్రిప్పి చూశాను. "మను." అది మనూకి ఇష్టమైన పాట. నాకు తెలుసా విషయం. సరే ఇక తప్పదుగా మరి, ఆ పాటే పాడాను. ప్రశంసలూ అందుకున్నాను. ఆ రాత్రి కలల అలజడికి నిదుర కరువయింది. అలా చెలియలికట్ట దాటని నా ప్రేమ పొంగుతూనే వుంది. మా మూగ ప్రేమలో రోజులు క్షణాల్లా దొర్లుతున్నాయి.

ఒక దుర్దినాన తెలిసిందా విషయం. మా నాన్న గారికి ట్రాన్స్ఫర్ ఆర్డర్స్ వచ్చాయి. మేము ఆ వూరి నుండి అతి త్వరలో వెళ్ళిపోవాలట నాకైతే భోరున ఏడవాలనిపించింది. మనూని చూడకుండా ఎలా వుండడం? మనసంతా దిగులు నిండింది. ఏ పనీ చేయబుద్ధి కావటం లేదు. తెల్లవారితే మా ప్రయాణం. ఆ రోజు ఆదివారం. సమయం రాత్రి ఏడు గంటలవుతూంది. అందరూ టి.వి.లో సినిమా చూస్తున్నారు. నాకు చూడబుద్ధి కాక వచ్చేశాను. మేం వెళ్ళిపోతున్నామని మనుక్కూడా తెలిసింది. మనూతో నా మనసు తెలిపేదెలా? మనసు నిండా ఆలోచనలు. మల్లె పందిరి దగ్గర గట్టు మీద కూర్చున్నాను. 'తెలవార దేమొ స్వామీ' హమ్ చేస్తున్నాను. దగ్గరలో మెత్తని అడుగుల సవ్వడి. చూశాను. మను. నా హృదయంలో సంతోష తరంగం ఉవ్వెత్తున ఎగిసింది. ఆ మసక చీకటిలో మల్లె పందిరి దగ్గర నా ప్రక్కన దాదాపుగా నన్ను ఆనుకుని కూర్చున్నాడు మను. లేవబోయాను. నన్ను కదలనివ్వలేదు. నా నడుము చుట్టూ చేయి వేసి నన్ను దగ్గరగా తీసుకున్నాడు. నేను పాడుతూ ఆపిన పాటను తను కంటిన్యూ

చిరునామా

టి. భూలక్ష్మి
రూమ్ నెం: 27
స్టాఫ్ నర్సింగ్ క్వార్టర్స్
గవర్నమెంట్ జనరల్ హాస్పటల్
గుంటూరు - 522 001.

కోరమాండల్
సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్



చేశాడు. "మక్కువ మీరగ అక్కున జేరిచి, అంగజుకేళిని..." అంటూ తన పెదాలతో నా పెదాలందుకున్నాడు. కాలం స్థంభించి నట్లుంది. నేను శ్వాస తీసుకోవటం కూడా మరచిపోయాను. ఆ అధరామృతాస్వాదనలో ఏవో లోకాలలో విహరిస్తున్నాము. "చిన్నీ!" లోపలి నుండి అమ్మ నా కోసం పిలిచిన పిలుపు స్వర్గపు టంచుల నుండి అగాధానికి త్రోసినట్లుగా వుంది. విడువలేక విడువలేక వేరయ్యాము. "తెలవారనీకు దేవీ!" నా చెవిలో గుసగుసగా అని వెళ్ళిపోయాడు మను. ఆ తరువాత ఎన్నో రాత్రులు, ఎన్నో రోజులు మారాయి. కాని నాకు ఆ రేయి తెలవారలేదు. "నీ తలపుల మునకలో అలసిన దేవేరి అలవేలు మంగకూ తెలవారదేమొ స్వామీ!" అంటూ నేనింకా మను నిరీక్షణలోనే వున్నాను.

●●

# జోక్స్

యర్రంశెట్టి శాయి

## ముందుచూపు

ఓ సినిమా హీరో గారికి హఠాత్తుగా గుండె పోటు వచ్చింది. వెంటనే తనింటికి సమీపం లోనే ఉన్న డాక్టర్‌కి ఫోన్ చేశాడు.

"అలాగా! వెంటనే వచ్చేస్తున్నా" అన్నాడు డాక్టర్ కంగారుగా.

"మీరొచ్చేలోపల నన్నేం చేయమంటారు?" భయంగా అడిగాడు హీరో.

"నాకివ్వాల్సిన ఈ విజిటింగ్ ఫీజ్ చెక్ రాస్తూండండి" ఆదుర్దాగా చెప్పాడు డాక్టర్.

## హోలీ ప్రేయర్

సినిమాల్లో అడపాదడపా వేషాలు వేసే ఓ ఎక్స్ట్రా పీరుడు తన క్లాస్‌మేట్ గాంధీకి ఉత్తరం రాశాడు.

డియర్ గాంధీ,

నిన్న నీకొక ఉత్తరం రాశాను. అందులో నేను ఎంత దారుణమయిన బీదతనంతో బాధ పడుతున్నానో తిండికి కూడా డబ్బు లేక ఎంత అలమటించి పోతున్నానో రాస్తూ అర్జంటుగా అయిదు వందల రూపాయిలు పంపమని నిన్ను కోరాను. తీరా ఆ ఉత్తరం పోస్ట్ చేశాక నాకు చాలా సిగ్గు వేసింది. ప్రాణ స్నేహితుడి వయినందుకు నిన్ను అప్పు అడిగి బాధించడం న్యాయం కాదనిపించింది. అంచేత ఆ ఉత్తరం నీకు చేరకుండా వుండాలని ఆకలితో భగవంతుడిని ప్రార్థిస్తున్నాను.

ఇట్లు

నీ రాజేష్ కృష్ణ

సరిగ్గా వారం తర్వాత గాంధి దగ్గర్నుంచి జవాబు వచ్చిందతనికి.

ప్రియ మిత్రుడు రాజేష్‌కి!

నీ ప్రార్థన భగవంతుడు విన్నట్లున్నాడు అందుకే నీ ఉత్తరం నాకు చేరలేదు."

ఇట్లు

ఎప్పటికీ నీ గాంధి